## క్లుప్తంగా

### 'మద్ది'లో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

**జంగారెడ్డిగూడెం రూరల్:** కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారికి బుధవారం చామంతి పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉసిరి చెట్ల కింద కార్తీక దీపాలు వెలిగించారు. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, గురవాయిగూడెం సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, మద్ది ఆలయ మాజీ చైర్‌పర్సన్ కీసరి సరిత పాల్గొన్నారు.

### నేత్రపర్వం.. రామయ్య కల్యాణం

**జంగారెడ్డిగూడెం రూరల్:** గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి వారి క్షేత్రంలో భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. భద్రాచలం నుంచి వచ్చిన అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల అభివృద్ధికి కృషి

**కొయ్యలగూడెం:** ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ ద్వారా మత్స్యకార సంఘాలు చేపల పెంపకాన్ని వృద్ధి చేసుకుంటూ అభివృద్ధి సాధిస్తున్నారని ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు. బుధవారం అంకాలచెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ పాశం నాగమణితో కలిసి పాల్గొన్నారు. ఎఫ్‌డీవో కె.మంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు పాండ్రంకి శ్రీనివాస్, కార్యదర్శి నవిరి లక్ష్మీనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

### పరామర్శ

**పోలవరం రూరల్:** కొత్తపట్టిసీమలో ఇటీవల మృతిచెందిన వలవల పెద వెంకటస్వామి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కురసాల కన్నబాబు బుధవారం పరామర్శించారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. కన్నబాబు వెంట సినీ డైరెక్టర్ కురసాల కళ్యాణ్ కృష్ణ, గర్రి శ్రీనివాస్, కరిబండి త్రినాధరావు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**పోలవరం రూరల్:** గూటాల గ్రామంలోని సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దత్తి రాంబాబు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.రాంబాబు మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం మద్దతు ధరతో పాటు గోను సంచులు, లేబర్, రవాణా ఛార్జీలు కలిపి 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుంకర అంజిబాబు, ఆర్‌బీకే చైర్మన్ కరిబండి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**లింగపాలెం:** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని కలరాయునగూడెం సర్పంచ్ చలగుళ్ల రవిబాబు అన్నారు. బుధవారం కలరాయునగూడెం శివారు ఎర్రవారిగూడెం గ్రామంలోని బీసీ ఏరియాలో రూ.5 లక్షల సురక్షా నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు సర్పంచ్ రవిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవిబాబు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అన్ని కల్పించనున్నట్లు తెలిపారు. త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ సూరిబాబు, బి ప్రభాకరెడ్డి, పాకనాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### కార్తీక వనసమారాధన

**జంగారెడ్డిగూడెం రూరల్:** మైసన్నగూడెంలో బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కుర్రు నాగరాజు ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ పాల్గొని వన భోజనాలను ప్రారంభించారు. 300 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంత శ్రీరామ్ మాట్లాడుతూ ఆత్మీయులందరూ ఒకచోట చేరడం వలన బంధాలు, బాంధవ్యాలు బలపడతాయని పేర్కొన్నారు.

### కూరగాయల కట్టింగ్ మెషీన్ల బహూకరణ

**జంగారెడ్డిగూడెం:** స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రసాదాల తయారీ (పిండిమెషీన్), కూరగాయలు కట్టింగ్ మెషీన్, పులిహోర తయారీకి పెద్ద రేకును దాతలు అందజేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. బుట్టాయగూడెంకు చెందిన కరాటం రాజగోపాల్, గీత కుటుంబ సభ్యులు ఈ మెషీన్లు అందజేసినట్లు చెప్పారు. దాతలను వేద పండితులు ఆశీస్సులు, స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలుతో సన్మానించారు.

# రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జగన్ కావాలి



టి.నరసాపురం: మర్రిగూడెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



ద్వారకాతిరుమల: ఎం.నాగులపల్లిలో కరపత్రాన్ని మహిళకు అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చింతలపూడి: బోయగూడెంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

**టి.నరసాపురం:** రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఉద్ఘాటించారు. మండలంలోని మర్రిగూడెంలో బుధవారం సాయంత్రం ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, రైతుల అభ్యున్నతి చెందాలన్నా, రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా కావాలన్నా, ఉద్యోగ కల్పన, అన్ని వర్గాల ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అవసరమని వివరించారు. గత టీడీపీ పాలనలో దోచుకో దాచుకో అన్న చందంగా పథకాలు అమలు చేశారని, అవి కూడా అరకొరగా ఇచ్చేవారని, జన్మభూమి కమిటీల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని వివరించారు. ఆయా సమస్యలన్నిటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెరదించిందని, సంక్షేమ పథకాలను ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా లబ్ధిదారులకు అందించడం ద్వారా పారదర్శకత చూపిందన్నారు. సచివాలయాల ద్వారా గ్రామాల్లోని అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాల సూర్యనారాయణ రాజు, ఎంపీపీ దారిపోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు, పేర నిరీక్షణరావు, తాటిచిన వెంకటేశ్వరరావు, దేవరపల్లి ముత్తయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆచంట నాగమణి, ఉమ్మడి తేజ, నార్లపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**మంచి చేస్తున్నాం.. అందుకే జనంలో ఉన్నాం**

**ద్వారకాతిరుమల:** ప్రజలకు మంచి చేస్తున్నాం.. అందుకే జనంలోకి ధైర్యంగా వస్తున్నామని, ప్రజలకు ఏం మేలు చేశామో చెప్పగలిగే దమ్ము, ధైర్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే తలారి, బుధవారం ఉదయం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగనే సీఎం ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన భవిష్యత్తు బాగుండాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, బడుగు బలహీన వర్గాలకు మంచి జరగాలన్నా మళ్లీ జగనే సీఎం కావాలని ఆయన అన్నారు. టీడీపీ, జనసేనలు మునిగిపోయే నావలని, వాటిని నమ్మి ఎవరూ మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ యంట్రపాటి సునీల్, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపన్న, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోయపాటి మోహన్‌రావు, తూంపాటి భీమేశ్వరరావు, మద్దిపాటి వెంకటేశ్వరరావు, చిలకా ఇజ్రాయెల్, పడమటి ఏసు తదితరులున్నారు.

**చింతలపూడి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ అన్నారు. ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమంలో భాగంగా బోయగూడెం సచివాలయం పరిధిలో బుధవారం పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ప్రారంభించారు. సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మిరియాల దిలీప్, మండల వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ వెంపా కృష్ణ, బి ప్రసాదరాజు, జైపాల్, గోపి, ప్రకాష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**లక్కవరంలో...**

**జంగారెడ్డిగూడెం రూరల్:** లక్కవరంలో ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ గెల్లా వెంకట రమణ, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, సొసైటీ చైర్మన్ బడి దుర్గారావు పాల్గొన్నారు.

**సంక్షేమం, అభివృద్ధిపైనే దృష్టి**

**లింగపాలెం:** ముడిచెర్ల గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ మట్టా సురేష్, సర్పంచ్ రావి రమాదేవి, ఎంపీటీసీ ముల్లంగి హేమ, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నవనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్లు ముత్యాల రాధకృష్ణ, కె రామకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లిలో...**

**బుట్టాయగూడెం(జీలుగుమిల్లి):** జీలుగుమిల్లిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, సర్పంచ్ సిర్రి జగదాంబ, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, నాయకులు చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, బూరుగు ప్రేమ్‌కుమార్, కక్కిరాల చక్రి, రాము, కొప్పుల సత్యనారాయణ, కుమ్మర టోనీ, గంగుల రమేష్, సీలం చిన్నవెంకన్న పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం:** గవరవరంలో బుధవారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, గ్రామ కన్వీనర్ శీమకుర్తి సత్యనారాయణ, నాయకులు చిక్కాల దుర్గాప్రసాద్, దూలపల్లి కాంతారావు, బిరుదు గడ్డ ప్రేమ కుమార్, గంటా రమేష్, ఎస్‌కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

**అమరవరం పంచాయతీ పరిధిలో..**

**కుక్కునూరు:** అమరవరం పంచాయతీ పరిధిలో బుధవారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ అమరవరం పంచాయతీ కన్వీనర్ కోటగిరి నళినిప్రవార్, ఆవుల బాలక్రిష్ణారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహిళా సాధికారతకు సరైన నిర్వచనం



జంగారెడ్డిగూడెం 7వ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలన ద్వారా మహిళా సాధికారతకు సరైన నిర్వచనం చూపించారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం 7వ సచివాలయం పరిధిలో 18, 19, 20 వార్డుల్లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఉండాలనే ఉద్దేశ్యంతోతన పథకాలలో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చట్టసభల్లో సైతం సముచిత స్థానం కల్పించారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం మహిళలకు కేటాయించి మహిళా పక్షపాతిగా సీఎం మన్ననలు పొందుతున్నారన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, బత్తిన చిన్న, మేడవరపు విద్యాసాగర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ చనమాల శ్రీనివాస్, మురళి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ చింతా అనిల్‌కుమార్, పార్టీ వైద్యవిభాగం జిల్లా కార్యదర్శి కఠారి సీతారాం బాబు, ఐజక్, అమీర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు.



జంగారెడ్డిగూడెం రూరల్: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు



లింగపాలెం: ముడిచెర్లలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



కొయ్యలగూడెం: గవరవరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



కుక్కునూరు: అమరవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న పార్టీ నాయకులు

## వైఎస్సార్ జలకళ పథకం.. రైతులకు వరం



జలకళ పథకం ద్వారా రైతులకు పంపుసెట్లు, మోటార్లను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- రైతులకు పంపుసెట్లు, మోటార్ల అందజేత

**ద్వారకాతిరుమల:** వైఎస్సార్ జలకళ పథకం రైతులకు ఒక వరమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పలువురు రైతులకు జలకళ పథకం ద్వారా పంపుసెట్లు, మోటార్లను ఆయన ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల కష్టాలను పాదయాత్రలో స్వయంగా చూసిన జగన్ రైతులకు అండగా నిలుస్తానని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టి, మెట్ట ప్రాంత రైతుల కష్టాలను తీరుస్తున్నట్టు చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల మందికి ఉచితంగా వ్యవసాయ బోర్లు వేయాలని జగన్ సంకల్పించారన్నారు. బోరుతో పాటు పంపుసెట్టు, మోటారును సైతం రైతులకు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు 383 మందికి జలకళ బోర్లు వేయగా, అందులో అధికంగా ద్వారకాతిరుమల మండలంలో 208 బోర్లు వేసినట్టు చెప్పారు. ఇందులో 11 మంది రైతులకు ఉచితంగా పంపుసెట్లు, మోటార్లను అందించామని, ఒక్కో పంపుసెట్టు, మోటారు విలువ రూ.1.49 లక్షలన్నారు. రైతు ప్రయోజనం, శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనకాడదన్నారు. అన్నదాతలకు లబ్ధి చేకూర్చడమే జగన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, అంబటి గాంధి, ఉక్కుర్తి వెంకట్రావు, కొల్లి సుబ్బారావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, ఆచంట బన్ను, మానుకొండ సుబ్బారావు, ఎంపీటీసీ ఆకుర్తి సత్యన్నారాయణ, మిడతా చందు, దాసరి రాంబాబు, కొడుదుల ప్రసాద్, గుర్రాల లక్ష్మణ్, ఎంపీడీవో తిరుపతిరావు తదితరులున్నారు.

## ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



టి.నరసాపురం: గట్టుగూడెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



జంగారెడ్డిగూడెం: 22వ వార్డులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

**టి.నరసాపురం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా బడుగు బలహీన వర్గాల జీవన ప్రమాణస్థాయి పెరిగిందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని గిరిజన గ్రామమైన గట్టుగూడెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. బాలరాజు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు గత నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి వాటి పరిష్కారాలను అధికారులకు సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపీపీ ధారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు, పార్టీ గిరిజన రాష్ట్ర కార్యదర్శి నిరీక్షణరావు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు, దేవరపల్లి ముత్తయ్య, తాటి చిన్న వెంకటేశ్వరరావు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆచంట నాగమణి, ఎంపీటీసీ నార్లపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోంది**

**జంగారెడ్డిగూడెం:** ప్రతి గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనే కారణమని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం 8వ సచివాలయం పరిధిలోని 22, 23వ వార్డులో బుధవారం 201వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే ఎలీజా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల, ప్రజలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజల ఆదరణతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని, 175కు 175సీట్లు సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా సీఎం గద్దెనెక్కడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, స్థానిక కౌన్సిలర్ తడికమళ్ల మురళి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ చలమాల శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు కంచర్ల గీత, ఉగ్గం దుర్గాప్రసాద్, ఎల్‌వీఆర్ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

**చింతలపూడి:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. చింతలపూడి మండలం మల్లాయగూడెం గ్రామంలో బుధవారం పంటలు ఎండిపోయిన రైతులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది సరైన వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయాయని రైతులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే ఎలీజా భరోసా ఇచ్చారు. రైతులకు ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ నెలలోనే మండలంలో ఎండిపోయిన పంటలను పరిశీలించినట్లు చెప్పారు. వర్షాభావంతో జిల్లాలో ఎక్కువగా పంటలు ఎండిపోయిన ఘటన చింతలపూడి మండలంలోనే జరిగిందని చెప్పారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డికి వివరించగా ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కేంద్ర బృందం కూడా పరిశీలించే అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ బి నాగకుమార్, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.కాంతారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మిరియాల దిలీప్, పోతునూరు సొసైటీ అధ్యక్షుడు కె.గోవర్ధనరెడ్డి, సీహెచ్ బాబ్జి, చీకటి రామకృష్ణ, జోషి, పింగుల ఏసు తదితరులు పాల్గొన్నారు.

### మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గం

**జంగారెడ్డిగూడెం:** ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వరక శ్యామల, మన్నవ యామిని ఎన్నికయ్యారు. పట్టణంలోని చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాల్ నందు మంగళవారం నిర్వహించిన ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా కొండేటి బేబి, గౌరవాధ్యక్షురాలుగా కొమ్మన అన్నపూర్ణ, కార్య నిర్వాహక కార్యదర్శిగా అడ్డగర్ల లక్ష్మి ఇందిర ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలుగా కరాటం సీతామహాలక్ష్మి, మరిని జగదాంబ, మావూరి విజయ, సహాయ కార్యదర్శులుగా ఆడమిల్లి జ్యోతి, గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి ఎన్నికయ్యారు.

### వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

**బుట్టాయగూడెం:** గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో మంచినీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. మండలంలో సుమారు రూ. 12 కోట్ల 40 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

**రాబోయే ఎన్నికల్లో బూత్ ఇన్‌చార్జిలదే కీలక పాత్ర**

పోలింగ్ బూత్‌స్థాయి పటిష్టంగా ఉన్నప్పుడే రాబోయే ఎన్నికల్లో విజయం సాధించగలుగుతామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. దుద్దుకూరులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల స్థాయిలో ఎంపికైన బూత్ ఇన్‌చార్జిలు బుధవారం బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బూత్ ఇన్‌చార్జిలతే కీలక బాధ్యత అని అన్నారు. అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 7 మండలాలకు చెందిన మండల స్థాయి బూత్ ఇన్చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ ప్రకటనపై ఖండన

**కుక్కునూరు:** చిరవెల్లి గ్రామంలో బీజేపీలో చేరిన బాణాల వీరాచారి వైఎస్సార్ సీపీ పార్టీకి చెందిన వ్యక్తి కాదని అతను బీఆర్‌ఎస్ పార్టీ కుక్కునూరు మండల అధ్యక్షుడని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరాచారి వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చినట్లుగా బీజేపీ నాయకులు ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

### హక్కుల సాధనకై ఆదివాసీలు ఉద్యమించాలి

**కుక్కునూరు:** బిర్సాముండా ఉద్యమ స్ఫూర్తితో ఆదివాసీలు తమ హక్కుల సాధనకై ఉద్యమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ నాయకులు కూరం సంజీవరావు పేర్కొన్నారు. బుధవారం రెడ్డిగూడెంలో బిర్సాముండా 149 జయంతి సందర్భంగా ఏఎస్‌పీ నాయకులు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పీ నాయకులు పొడియం వేణుగోపాల్, పైదా బుర్రయ్య, పైదా చిన్నబాబు, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

### నేడు ఎమ్మెల్యే ఎలీజా పర్యటన

**జంగారెడ్డిగూడెం రూరల్:** గురవాయిగూడెంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. మధ్యాహ్నం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందన్నారు.